క్లుప్తంగా

కలర్ ఉత్సవ్‌లో విజేతలుగా బట్టేలంక విద్యార్థులు



డ్రాయింగ్ పోటీల్లో సైకిల్ గెలుచుకున్న విద్యార్థి

మలికిపురం: 'పగతి కలర్ ఉత్సవ్' పోటీల్లో బట్టేలంక ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. మొదటి స్థానంలో నిలిచిన తొమ్మిదో తరగతి విద్యార్థి వి.రాజేష్ బంపర్ ప్రైజ్‌గా బాయస్ సైకిల్‌ను గెలుచుకున్నాడు. అలాగే 20 బంగారు పతకాలు, 20 వెండి పతకాలు, ఐదు ప్రత్యేక బహుమతులను విద్యార్థులు గెలుచుకున్నారని ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు తెలిపారు. విద్యార్థులను డ్రాయింగ్‌లో తీర్చిదిద్దిన డ్రాయింగ్ టీచర్ బి.రాజేంద్రను పలువురు అభినందించారు. ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ బాలాజీ, రోటరీ క్లబ్ చైర్మన్ సోమిశెట్టి మురళీకృష్ణ, సర్పంచ్ బోనం సీతారత్నం, ఎస్ఎంసీ చైర్మన్ లక్కం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లలితకుమారి

రాజోలు: వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో రాజోలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఈ మేరకు మంగళవారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.లలితకుమారి ఆధ్వర్యంలో విద్యార్థినులను అభినందించారు. ఈ నెల 27న అమలాపురం మండలం వన్నెచింతలపూడిలో జరిగిన మండల, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వ్యాసరచన పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఎం.జోయల్ మెర్సీ, సీహెచ్ వసంతలక్ష్మి, సీహెచ్ సౌభాగ్యలక్ష్మి, ఉపన్యాస పోటీల్లో పదో తరగతి విద్యార్థినులు ఎస్.రత్నవల్లి, జె.స్నేహిత, ఐ.కీర్తన ప్రతిభ కనబరిచారు. వైస్ ప్రిన్సిపాల్ బి.అనితకుమారి, ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

అలీ అస్గర్‌కు కన్నీటి నివాళి



నగరంలో అలీ అస్గర్ ఊయల ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయుడు అలీ అస్గర్‌కు మంగళవారం ముస్లింలు కన్నీటితో నివాళులర్పించారు. అర్బయీన్ కార్యక్రమాల్లో భాగంగా అలీ అస్గర్ ఊయలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. నగరం పెద పంజీషా నుంచి మంజిలే కర్బలా వరకు ఈ ఊరేగింపు జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొని ఆరు నెలల పసికందు అలీ అస్గర్‌ను హతమార్చిన సంఘటనలను స్మరించుకుని కన్నీటి పర్యంతమయ్యారు. పలు భక్త బృందాలు ముస్లింలకు ప్రసాదాలు వితరణ చేశాయి. గురుహే తాజ్‌దారే పురాత్ భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో మత ప్రబోధకుడు మజ్లిస్ ఆలపించారు. భారీ సంఖ్యలో ముస్లింలు ఊయల ఊరేగింపులో పాల్గొన్నారు.

అందరూ తినేలా రుచిగా ఉండాలి



జి.అగ్రహారంలో మధ్యాహ్న భోజన పథకంపై సూచనలు చేస్తున్న ఎంపీడీఓ సరోవర్

అంబాజీపేట: ప్రభుత్వం ఆదేశాల మేరకు మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే కాకుండా అందరూ తినేలా రుచిగా ఉండాలని ఎంపీడీఓ జి.సరోవర్ అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వంట చేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థులంతా పాఠశాలలోనే భోజనం చేసేలా శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంట చేసే ప్రాంతం మంత పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారంపై వివరించి చైతన్య పరచాలన్నారు. ఎంపీడీఓ వెంట ఈఓపీఆర్డీ బి.మమత తదితరులు ఉన్నారు.

ధైర్యంగా విధులు నిర్వహించేలా చేయాలి



ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలతో మహిళా వైద్యులతో పాటు మహిళా వైద్య సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆస్పత్రిలో ధైర్యంగా విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి. విధి నిర్వహణలో రక్షణగా ప్రత్యేక వ్యవస్థతో పాటు, రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే మహిళా సిబ్బందికి భద్రత కల్పించాలి. ఆస్పత్రి పరిసరాలు గమనించేందుకు సీసీ కెమెరాల నిఘా ఉండాలి. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే వైద్య సిబ్బందికి, ప్రభుత్వాస్పత్రిని పరిశీలించే విధంగా పోలీస్ బీట్‌ను ఏర్పాటు చేయాలి.

– ఆర్.పావని, వైద్యురాలు, లక్కవరం పీహెచ్‌సీ



మహిళలకు రక్షణ కరవైంది




ముఖ్యంగా ఇంటి నుంచి బయటకు వెళ్లి వచ్చే మహిళలకు రక్షణ కరవైంది. కోల్‌కతాలో జరిగిన సంఘటనతో మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ పై దృష్టి సారించాలి. కఠిన చట్టాలు రూపొందించి అమలుకు ప్రయత్నించాలి. గ్రామాల్లోను, ప్రభుత్వ, ప్రైవేటు అస్పత్రుల్లో వైద్యసేవలందించే మహిళలకు భద్రత కల్పించాలి.

– బి.మంగాదేవి, వైద్యురాలు, అయినవిల్లి పీహెచ్‌సీ

బ్యారేజీ ప్రయాణమంటే హడల్

- అధ్వాన రహదారే కారణం
- రాత్రయితే అంధకారమే
- మలుపుల వద్ద లేని సిగ్నల్ బోర్డులు



కాటన్ బ్యారేజీపై లైట్లు వెలగకపోవడంతో కమ్ముకున్న చీకటి

ఆత్రేయపురం: ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీపై ప్రయాణమంటేనే ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. బ్యారేజీపై నుంచి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి ప్రసిద్ధి చెందిన కాటన్ బ్యారేజీ అధికారుల అలసత్వంతో అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందని వాహనదారులు వాపోతున్నారు. బ్యారేజీపై ప్రయాణించాలంటే ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. బ్యారేజీపై అధికారుల నిర్లక్ష్యం, బ్యారేజీ పర్యవేక్షకుల లోపం ప్రయాణికుల పాలిట శాపంగా మారుతుంది. కనీసం విద్యుత్ వెలుగులు లేకపోవడం , ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడం ప్రమాదాలకు కారణమవుతుంది. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే వాహనాలను రవాణా అధికారులు పట్టించుకోవడం లేదరు. వంతెన రహదారిపై గోతులను సమయానుకూలంగా పూడ్చకపోవడం వంటి పరిస్థితులు ఇలాంటి ఘోర ప్రమాదలకు ప్రధాన కారణమవుతున్నాయి. వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి చెందిన రాజమహేంద్రవరం పట్టణానికి వెస్టన్, సెంట్రల్ డెల్టా ప్రాంతాల వాసులకు ప్రధాన రహదారి ధవళేశ్వరం బ్యారేజీ. ఈ బ్యారేజీ మీదుగా ప్రతి రోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే అందుకు అనుగుణంగా బ్యారేజీ రోడ్డును ఆధునీకరించడంలో, విద్యుదీకరణ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుంది. రోడ్డు, విద్యుత్ సౌకర్యాల కారణంగా గతంలో కూడా అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇలా ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా తాత్కాలిక చర్యలే తప్ప శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

పర్యవేక్షణ కరవు



బ్యారేజీ భద్రత పటిష్టతపై పట్టించుకునే అధికారులు కరవయ్యారు. బ్యారేజీపై భారీ వాహనాలపై నిషేధం ఉన్నా నిత్యం వేలాదిగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీనిపై అధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. అధికారులు బ్యారేజీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

– సూర్యతేజ, ఆత్రేయపురం

మరమ్మతులు చేపట్టాలి



ఈ బ్యారేజీపై ప్రయాణం చేయాలంటే నరకయాతనగా మారింది. రాత్రి వేళల్లో విద్యుత్ లైట్లు కూడా వెలగటం లేదు. దీనికి తోడు బ్యారేజీపై రోడ్డు పలు చోట్ల ఛిద్రమైంది. ఇప్పటికైనా అధికారులు కాటన్ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టాలి

– అద్దాల రమేష్

ప్రజలకు అనుకూలమైన చార్జీలు నిర్ణయించాలి

సఖినేటిపల్లి: మాధవాయిపాలెం ఫెర్రీగా ప్రభుత్వం గుర్తింపు పొందిన సఖినేటిపల్లి, నర్సాపురం వశిష్ఠ గోదావరి రేవులో పంటు రాకపోకల చార్జీలు ప్రజలకు అనుకూలంగా నిర్ణయించాలని నర్సాపురం, సఖినేటిపల్లి ఎంపీడీవోలకు, మండల ఎంపీటీసీ కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్ మంగళవారం వినతులు అందజేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో పీవీ సత్యనారాయణకు వినతి పత్రం ఇచ్చి వాటి నకళ్లను మీడియాకు అందజేశారు. గత కొంతకాలంగా అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. గత రేవు పాటను టెండరు దారులు రూ.3.61 కోట్లకు పాటపాడి, ప్రజల వద్ద నుంచి మనిషి ఒక్కంటికీ రూ.15, ద్విచక్రవాహనానికి రూ.30 వసూలు నిర్ణయం ఉన్నప్పటికీ, టెండర్‌దారునికి నష్టం వాటిల్లుతుందనే కారణంతో మనిషికి రూ.20, ద్విచక్రవాహనానికి రూ.35 వసూలు చేశారన్నారు. కాగా టెండర్ పాటలను పాటదారులు ఎంత మొత్తంలో పాడినా చార్జీలు అధిక మొత్తంలో పెంచకుండా చర్యలు తీసుకోవాలని, పాట సమయంలో చార్జీలను మనిషి ఒక్కంటికీ రూ.10, ద్విచక్రవాహనానికి రూ.25గా నిర్ణయించే విధంగా చర్యలు తీసుకోవాలని నోబుల్ కోరారు.

దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ

మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



వానపల్లిలో వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, భాస్కరరామం

కొత్తపేట: దేవాలయాల నిర్మాణం, పురాతన ఆలయాలు పునర్నిర్మాణం, ఆధునీకరణతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుందని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గత ఏడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, గ్రామానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కరరామం కృషి మేరకు శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి నూతన ఆలయం నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.1.5 కోట్లు మంజూరయ్యాయి. ఆలయ నిర్మాణం పూర్తి కాగా సోమవారం నుంచి భాస్కరరామం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రారంభోత్సవం, దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా రెండోరోజు మంగళవారం మండపారాధన, హోమ పూజలు, గోపూజ, గోదర్శనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనకు పండితులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు శాస్త్రోక్తంగా ఘనస్వాగతం పలికి పూజా ప్రాంగణానికి తోడ్కొని వెళ్లారు. పండితులు జగ్గిరెడ్డికి వేదాశీర్వచనం పలికారు. అనంతరం జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత సీఎం జగన్ ప్రభుత్వంలో ఎన్నో దేవాలయాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ గ్రామవాసి నేమాని భాస్కరరామం ప్రత్యేక శ్రద్ధతో పళ్లాలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేసుకున్నామన్నారు. నేడు ఈ వేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని నిర్మించుకున్నామన్నారు. దేవదాయ శాఖ, టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.14.35 కోట్లతో నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు నూతన శోభ తీసుకువచ్చామన్నారు. ప్రధానంగా వానపల్లి పళ్లాలమ్మ ఆలయంతో పాటు వాడపాలెం, రావులపాలెం మండలం గోపాలపురం, ఆత్రేయపురం మండలం పులిదిండి, ఆలమూరు మండలం చింతలూరు ఆలయాలకు రూ.9.95 కోట్లు విడుదలయ్యాయన్నారు. అలాగే 44 రామాలయాలకు టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.4.40 కోట్లు విడుదల చేయించామన్నారు. మరో 44 ఆలయాలకు రూ.4.40 కోట్లతో ప్రతిపాదించామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ బండారు రాజా, రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకులు ముసునూరి వెంకటేశ్వరరావు, కర్రి నాగిరెడ్డి, సర్పంచ్ రెడ్డి చంటి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఒగ్గు సత్యనారాయణ, బండారు సత్తిబాబు, ఇసుకపట్ల సునీల్, ఆలయ కమిటీ అధ్యక్షుడు అన్నందువుల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సామూహిక సీమంతాలు



కొత్తపేట సత్యసాయి మందిరంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న కమలారాణి, జయలక్ష్మి

కొత్తపేట: స్థానిక సత్యసాయి నిలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, సత్యసాయి సేవా సమితి కన్వనర్ కంకటాల సత్యనారాయణ, సమితి సభ్యుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. దానిలో భాగంగా స్వామి వారికి 100 రకాల పిండి వంటలు ప్రసాదంగా నివేదించారు. 100 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వైద్యులు కె.ప్రభాకర్, అన్నపూర్ణ పాల్గొని గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. అనంతరం పండితుల ఆశీర్వచనాల నడుమ ముఖ్యఅతిథులుగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనందరావు సతీమణి బండారు కమలారాణి, సర్పంచ్ బూసి జయలక్ష్మి, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు దంపతుల చేతుల మీదుగా గర్భిణులకు పసుపు, కుంకుమ, గాజులు, చీర, రవిక, పళ్లెం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆధ్యాత్మిక విభాగం కోఆర్డినేటర్ రాంబాబు, సమితి సభ్యులు సుతాపల్లి లక్ష్మీనారాయణరావు, చింతం రామకృష్ణ, మారిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'మాదిరెడ్డి' ట్రస్ట్ సేవలు అభినందనీయం



విద్యార్థికి ఉపకార వేతనం అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

రాజోలు: మాదిరెడ్డి వెంకట సూర్యకాంతం మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. మంగళవారం రాజోలులోని ట్రస్ట్ ఆధ్వర్యంలో 40 మంది విద్యార్థులకు రూ.1.72 లక్షలు ఉపకార వేతనాలుగా అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ మేడిచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ 2006లో ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాదిరెడ్డి శ్రీనివాసరావు ట్రస్ట్‌ను కుల, మతాలకు సంబంధం లేకుండా పూర్ అండ్ మెరిట్ ఆధారంగా ఇంటర్ నుంచి పీజీ అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేలా ఏర్పాట్లు చేశారన్నారు. ప్రస్తుతం విద్యారంగంలో చాలా పోటీ ఉందన్నారు. పోటీకి తగిన విధంగా విద్యార్థులు స్కిల్ పవర్‌తో పాటు విల్‌పవర్‌ను సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన దిశగా కష్టపడి ఇష్టంగా చదవాలన్నారు. ముఖ్యఅతిథులుగా మామిడికుదురు, విశ్వేశ్వరాయపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీను, సీహెచ్ చింతామణి పాల్గొని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఉపాధ్యాయులు కంకటాల శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాస్, పిండి ప్రసాద్, మాదిరెడ్డి ప్రసాద్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాజోలు: రాజోలు ఆర్టీసీ బస్‌డిపో పరిధిలో ఈ నెల 28న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ పి.భాస్కరరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 28న మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం జరుగుతుందన్నారు. ప్రయాణికులు తమ అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ప్రయాణికులు డిపోలోని 08862 221057 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

పాము కాటుకు గురైన లస్కర్

అంబాజీపేట: ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న లస్కర్ మంగళవారం పంట కాలువలో చెత్తను తొలగిస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. ముక్కామల లాకుల వద్ద పంట కాలువలో పేరుకుపోయిన చెత్త తొలగిస్తుండగా లస్కర్ దంగేటి పవన్‌కుమార్‌ను పాము కరిచింది. దాంతో అతడు లాకు సూపరింటెండెంట్, ఇరిగేషన్ ఏఈ, లస్కర్‌లు స్థానిక పీహెచ్‌సీకి ప్రథమ చికిత్సకు తరలించారు. అనంతరం క్షతగాత్రుడిని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

మురుగునీటి తూరల కోసం రైతుల డిమాండ్



నిరసన తెలుపుతున్న రైతులు

మామిడికుదురు: స్థానిక పంచాయతీ డ్రైన్ నీరు వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌లోకి మళ్లించే విధంగా తూరలు ఏర్పాటు చేయాలంటూ గ్రామస్తులు మంగళవారం నిరసన తెలిపారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో మురుగు నీరు డ్రైన్‌లోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. దీనిపై రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కూడా సంబంధిత అధికారులకు లేఖ రాశారన్నారు. దీంతో పాటు పంట పొలాల నుంచి ముంపు నీరు ఆరు మురుగు తూరల ద్వారా వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌లోకి వెళ్లేదన్నారు. బైపాస్ నిర్మాణంతో మురుగు నీటి తూరలు మూసుకు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు తూరలు స్థానే కేవలం ఒక తూర మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. దీని వల్ల తమ పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన అయిదు తూరలు కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, యాలి శ్రీనివాస్, రుద్రా శ్రీనివాస్, యింటి మహీంద్ర, నయినాల సత్యమూర్తి, పెచ్చెట్టి భాస్కరరావు, బండారు సరయ్యకాపు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యపై దృష్టి సారించాలి



బహుమతులు అందజేస్తున్న దాత సత్యనాగ భూషణరావు, ప్రభావతి, హెచ్ఎం సాయిరామ్

అంబాజీపేట: శాస్త్ర సాంకేతిక విద్య వైపు ప్రతి విద్యార్థి దృష్టి సారించాలని హెచ్ఎం కె.సాయిరాం అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో 6 నుంచి తొమ్మిదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దాతలు అందించిన సాయాన్ని మంగళవారం పంపిణీ చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ కామిశెట్టి సత్యనాగభూషణరావు తల్లిదండ్రులు కామిశెట్టి వీరాస్వామినాయుడు, సూర్యకాంతం ట్రస్ట్ పేరున 3 నుంచి తొమ్మిదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు, పెన్నులు, ఫోల్డర్లను అందజేశారన్నారు. సత్యనాగభూషణరావు ఆధ్వర్యంలో ట్రస్ట్ పేరున గత 26 ఏళ్లగా రూ.4 వేలు చొప్పున విద్యార్థులకు నగదు బహుమతులను పంపిణీ చేస్తున్నారన్నారు. అనంతరం సత్యనాగభూషనరావు, ప్రభావతి దంపతులను ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఎంసీ వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ, ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, బీఎస్ఎన్ మూర్తి, ఎం.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాయగూరల దుకాణాల బంద్

అంబాజీపేట: ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన కూరగాయల వ్యాపారి పోలిశెట్టి రమేష్ మృతికి సంతాప సూచికంగా అంబాజీపేట కాయగూరల వర్తక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బంద్ పాటించారు. రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించా, అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రమేష్ మృతికి కాయగూరల షాపులు మూసి వేసి సంతాపం తెలిపారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

కొత్తపేట: విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అన్నారు. మండపేట విజయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మదర్‌థెరిసా జయంతి, ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు పంపిణీ నిర్వహించారు. హెచ్ఎం కడలి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈఓ హరిప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కోలా మోహన సత్యసాయి, కోన భవ్యసాయిత్రిలకు రూ.2 వేలు చొప్పున ప్రోత్సాహం, వానపల్లి, కొత్తపాలెం, అవిడి జెడ్పీ ఉన్నత పాఠశాల ల్లో 211 మంది టెన్త్ విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి అరిగెల శివాజీ, కొత్తపాలెం హెచ్ఎం ఏఎస్ఎస్ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



ఆదుర్రులో గోకులాష్టమిలో భాగంగా శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయ ప్రాంగణంలో కృష్ణాష్టమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ ఈఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఆద్యంతం కనుల పండువగా జరిగాయి. ఆదుర్రు గ్రామంలో గోకులాష్టమి వేడుకలను త్రైత సిద్ధాంత సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. దీనిలో భాగంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు జరిపించారు. శివాలయం నుంచి కృష్ణుడి విగ్రహాన్ని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. మండల కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు హనుమంతరావు, బ్రహ్మాజీ, శేషు, ధర్మతేజ, సత్యవతి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

చింతలపల్లి ఉన్నత పాఠశాలకు అవార్డు



చింతలపల్లి ఉన్నత పాఠశాల క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజోలు: చింతలపల్లి ఉన్నత పాఠశాలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ క్రీడా ప్రతిభా అవార్డు వరుసగా రెండో పర్యాయం లభించింది. ఈ మేరకు మంగళవారం క్రీడల్లో ప్రతిభ చూపి అవార్డు సాధించిన పాఠశాలకు చెందిన క్రీడాకారులను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు ప్రసంగించారు. పాఠశాలకు చెందిన 31 మంది విద్యార్థులు బాక్సింగ్, ఫెన్సింగ్, కరాటే, క్రికెట్, రైఫిల్ షూటింగ్, సైక్లింగ్, ఆర్చరీ, రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రాణించారన్నారు. స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చూపిన ఐదు పాఠశాలల్లో చింతలపల్లి ఉన్నత పాఠశాల ఉండడం అభినందనీయమన్నారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని అవార్డు అందిస్తారన్నారు. గత ఏడాది ప్రథమస్థానంలో నిలవగా ఈ ఏడాది 151 పాయింట్లతో జిల్లాలో మూడవ స్థానంలో నిలిచిందన్నారు. ఈ మేరకు వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్‌ను సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, నాయకులు మట్టా సురేష్, బొక్కా రామకృష్ణ, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ తదితరులు అభినందించారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు

అయినవిల్లి: శ్రీకృష్ణాష్టమి మరుసటి రోజు భక్తి వేదాంత స్వామి ఆవిర్భవించిన పవిత్రదినంగా ప్రత్యేక పూజలు చేస్తారని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు ప్రభు సుందరశ్రీనివాసదాస్ అన్నారు. మంగళవారం ప్రభుపాదులు అవతరించిన సందర్భంగా శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు.

గోదావరి నదీ తీరంలో కలవరం



పెదపట్నంలంకలో దిగబడిన గోదావరి నది ఒడ్డు

మామిడికుదురు: పెదపట్నంలంకలోని నదీ తీరంలో గోదావరి ఒడ్డు ఒక్కసారిగా దిగబడిపోయింది. సుమారు 30 మీటర్ల పైగా భూమి కొబ్బరి చెట్లతో సహా నదిలోకి జారిపోవడంతో తీరంలోని రైతులు కలవరం చెందుతున్నారు. గత నెలలో గోదావరి నదికి వచ్చిన వరదల అనంతరం గోదావరి కోత విపరీతంగా పెరిగిందని రైతులు వాపోతున్నారు. పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు గ్రామాల్లో పలు కొబ్బరి చెట్లతో పాటు సారవంతమైన భూమి ఒక్కసారిగా నదిలోకి జారిపోతుందని రైతులు తీవ్రంగా మదన పడుతున్నారు. అప్పనపల్లిలో గోదావరి కోత ఇళ్లను సమీపించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వడం మినహా కోత నివారణకు పాలకులు తీసుకుంటున్న చర్యలు శూన్యమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోత నివారణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.